
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5



శ్రీకాకుళం

జిల్లా వార్తలు

సోమవారం 4 ఆగస్టు 2025

రేపు మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కుశాలపురం సమీపాన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల(శ్రీకాకుళం)లో కౌన్సెలింగ్ కాగా వివిధ బ్రాంచ్‌ల్లో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 5న స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. 'మెకానికల్‌లో 3, సివిల్‌లో 1, డీసీసీపీలో 25 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఏ కళాశాలలో చేరని విద్యార్థులు మాత్రమే స్పాట్ అడ్మిషన్లకు అర్హులు. కౌన్సెలింగ్ ఫీజుతోపాటు వార్షిక ఫీజు రూ.4,700 విద్యార్థులు తక్షణమే చెల్లించి అడ్మిషన్ పొందాలి. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 4వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తు చేయాల'ని ప్రిన్సిపాల్ సూచించారు.

రైతుసేవలకు దూరం!

- జిల్లాలో చాలాచోట్ల పూర్తికాని కేంద్రాలు
- బిల్లులు చెల్లించని వైసీపీ ప్రభుత్వం
- ఇరుకు గదుల్లో నిర్వహణతో ఇబ్బందులు
- ఆందోళనలో రైతులు



● టెక్కలి మండలం అక్కవరంలో 615 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కేంద్రం నుంచి విడుదలైన ఉపాధిహామీ నిధులతో రైతుభరోసా కేంద్రాన్ని నిర్మించారు. కానీ, కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో భవనాన్ని అప్పగించలేదు. ప్రారంభానికి నోచుకోక.. పిచ్చిమొక్కల మధ్య రైతుభరోసా కేంద్రం దర్శన మిస్తోంది. గత్యంతరం లేక గ్రామానికి చెందిన సామాజిక భవనంలోనే రైతుసేవా కేంద్రాన్ని నిర్వ హిస్తున్నారు. అందులోనే ఎరువులు నిల్వ ఉంచడం, విధులు నిర్వహించడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.



● టెక్కలి మండలం కె.కొత్తూరు సచివాలయం పరిధిలో 610 ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తున్నారు. ఇక్కడ కూడా రైతుభరోసా కేంద్రం నిర్మించినా.. బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో పాత పంచాయతీ కార్యాలయంలోని ఇరుకు భవనంలోనే విధులు నిర్వహిస్తున్నారు.

టెక్కలి రూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి):

రైతులకు ప్రభుత్వ సేవలు మరింత దగ్గర చేయాలనే ఉద్దేశంతో రైతుభరోసా (ప్రస్తుతం రైతుసేవా) కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటపు ప్రకటనలు చేసింది. విత్తనాలు, ఎరువుల పంపిణీతోపాటు పంట నమోదు, కొనుగోలు ప్రక్రియలన్నీ వీటి ద్వారా నిర్వహించాలని భావించింది. కానీ జిల్లాలో చాలాచోట్ల భవనాలు పూర్తిచేయలేదు. కొన్నిచోట్ల భవనాలు పూర్తయినా.. బిల్లులు చెల్లించకపోవడంతో ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఫలితంగా రైతులకు సేవలు దూరమై.. మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లాలో 656 రైతుభరోసా కేంద్రాలు ఉండగా.. 289 భవనాలు మాత్రమే పూర్తయ్యాయి. 162 కేంద్రాల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. వీటి నిర్మాణానికి గత ప్రభుత్వం సుమారు రూ.91.30 కోట్లు ఖర్చు చేసినట్టు లెక్కలు చూపించింది. కానీ, బిల్లులు చెల్లించకపోవడంతో నిర్మాణాలు సక్రమంగా సాగలేదు. కూటమి ప్రభుత్వంపై ఈ భారం పడనుంది.

పరికరాలు వృథా..

రైతుసేవా కేంద్రాల్లో కియోస్క్ యంత్రానికి రూ.80వేలు, రైతులకు అవగాహన కల్పించేందుకు టీవీ కోసం రూ.లక్ష చొప్పున ఇలా తదితర పరికరాల కోసం డబ్బులు వెచ్చించారు. కానీ బ్యాటరీలు పనిచేయకపోవడం, విద్యుత్ సరఫరా, ఇంటర్నెట్ సౌకర్యం లేకపోవడం తదితర సమస్యలతో పరికరాలు నిరుపయోగంగా మారాయి. కొన్ని భవనాల్లో ఇరుకు గదులు కారణంగా కంప్యూటర్ ఉంచడానికి సైతం స్థలం లేని పరిస్థితి కనిపిస్తోంది. కొన్నిచోట్ల టీవీలు ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి. వినియోగంలోకి (మిగతా 7వ పేజీలో..)



అక్కవరంలో ప్రారంభానికి నోచుకోని రైతుసేవా కేంద్రం

ఇబ్బందులు పడుతున్నాం..

రైతుసేవా కేంద్రం లేక ఇబ్బందులు పడుతున్నాం. ఇరుకు గదిలోనే ఎరువులు పంపిణీ చేస్తున్నారు. పశువులకు సంబంధించిన మందులతోపాటు అధికారులు అక్కడే విధులు నిర్వహించాల్సి వస్తోంది. ప్రస్తుతం ఎరువుల పంపిణీ వల్ల గది లోపలికి వెళ్లలేని పరిస్థితి.

-కె.తవిటయ్య, అక్కవరం, రైతు

భవనం నిర్మించి వదిలేశారు..

రైతుసేవా కేంద్రం నిర్మించినా.. భవనం ప్రారంభం కాలేదు. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. కొత్త భవనానికి వెళ్లేందుకు రోడ్డు నిర్మాణానికి మంత్రి అచ్చెన్నాయుడు ఇటీవల నిధులు విడుదలు చేశారు. ఇంకా పనులు ప్రారంభం కాలేదు.

-బి.నరసయ్య, అక్కవరం, రైతు

బిల్లులు చెల్లించకే..

గతంలో రైతుభరోసా కేంద్రాలు నిర్మాణం పూర్తయినా.. బిల్లులు ఇవ్వకపోవటంతో సంబంధిత కాంట్రాక్టర్లు భవనాలు ఇవ్వడం లేదు. దీంతో కొంత ఇబ్బంది ఉంది. కానీ ప్రభుత్వ భవనాల్లో అధికంగా విధులు నిర్వహిస్తున్నాం.

-కె.జగన్మోహన్‌రావు, ఏడీ, వ్యవసాయశాఖ టెక్కలి



హోంమంత్రి అనితకు కూర్మనాథుడి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో నరసింహనాయుడు

శ్రీకూర్మక్షేత్రం ఎంతో అద్భుతం

- హోంమంత్రి వంగలపూడి అనిత

గార/ అరసవల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): 'ప్రసిద్ధ శ్రీకూర్మం.. శిల్ప సంపదతో ఎంతో అద్భుతంగా ఉంది. ఈ క్షేత్రాన్ని మరింతగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంద'ని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఆదివారం గార మండలంలో శ్రీకూర్మం క్షేత్రాన్ని ఆమె కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. కూర్మనాథుడి సన్నిధిలో గోత్రనామాలతో పూజలు చేశారు. స్వామి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని ఈవో కె.నరసింహనాయుడు, ప్రధాన అర్చకులు సీతారామ నరసింహాచార్యులు ఆమెకు అందజేశారు. అనంతరం ఆలయ ప్రదక్షిణ మండపాన్ని, శిల్ప సంపదను, స్తంభాలపై ఉన్న శాసనాలను ఆమె పరిశీలించారు. ఆలయ చరిత్ర, ప్రాధాన్యం గురించి అర్చకులు దాసుబాబు హోంమంత్రికి వివరించారు. పురావస్తు శాఖాధికారులను సంప్రదించి ఈ ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఈవో నరసింహనాయడును ఆమె (మిగతా 8వ పేజీలో..)

స్నేహితుల దినోత్సవం రోజున విషాదం

- స్నానం కోసం నదికి వెళ్లి మృతి
- లబోదిబోమంటున్న కుటుంబ సభ్యులు





దుర్గాప్రసాద్ మృతదేహం.. ఇన్‌సెట్‌లో ఫైల్‌ఫొటో

బూర్జ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): స్నేహితుల దినోత్సవం రోజున తోటి స్నేహితులతో సరదాగా ఈతకు ఓ విద్యార్థి వెళ్లి మృత్యువాతపడిన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ నగరపంచాయతీ పరిధిలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సాసుబిల్లి దుర్గాప్రసాద్(19) మరో ఐదుగురు స్నేహితులతో కలిసి ఆదివారం బూర్జ మండలం లాభాం సమీపంలోని నాగావళి నదికి స్నానానికి వెళ్లాడు. ఈత రాకపోవడంతో నదిలోకి వెళ్లి చిక్కుకుపోయాడు. మిగతా ఐదుగురు ఒడ్డుకు చేరుకుని గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. దీంతో గ్రామ యువకులతో కలిసి మళ్లీ నదికి వెళ్లి దుర్గాప్రసాద్‌ను కాపాడే ప్రయత్నం చేశారు. బయటకు తీసుకువచ్చి చూడగా అప్పటికే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ ప్రవల్లిక సిబ్బం దితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కి తరలించారు. దుర్గాప్రసాద్‌కు తండ్రి రాము, తల్లి భారతి, చెల్లెలు ఉన్నారు. తమ కుమారుడు మృతి చెందాడని తెలుసుకుని తల్లిదండ్రులు గుండెలవిసేలా విలపిస్తున్నారు. స్నేహితులు విషాదంలో మునిగిపోయారు.

తాళాలు వేసిన ఇళ్లే వారి టార్గెట్
● ముగ్గురు ఒడిశా దొంగల అరెస్టు

8లో

ఉత్సాహంగా జిల్లాస్థాయి యోగా పోటీలు

కాంట్రాక్ట్ ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలి
● రాష్ట్ర చైర్మన్ కాంతారావు

7లో



కేశఖండన శాల వద్ద క్యూలో భక్తులు

అరసవల్లికి పోటెత్తిన భక్తులు

అరసవల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లికి భక్తులు పోటెత్తారు. ఆదివారం శ్రీసూర్యనారాయణస్వామిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. క్యూలైన్లు, సూర్యనమస్కారాల మండపం, కేశఖండనశాల భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం ఒక్క రోజే ఆదిత్యుడికి రూ.4,75,336 ఆదాయం లభించింది. టిక్కెట్ల ద్వారా రూ.2,04,100, విరాళాల రూపంలో రూ.86,651, ప్రసాదాల ద్వారా రూ.1,84,585 సమకూరినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

ప్రశాంతంగా నీట్ పీజీ ప్రవేశ పరీక్ష

నరసన్నపేట, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నరసన్నపేటలోని కోర్ టెక్నాలజీ కేంద్రంలో ఆదివారం నీట్ పీజీ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. జాతీయస్థాయిలో నిర్వహించే ఈ పరీక్షకు సుమారు 380 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరగ్గా.. కేంద్రం వద్ద నిర్వాహకులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

మరింత వైవిధ్యంగా..

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాల పెంపునకు కృషి
- పర్యవేక్షణకు ప్రత్యేక ప్రణాళికలు
- జిల్లా, మండల స్థాయిలో అకడమిక్ కమిటీల ఏర్పాటు



హిరమండలంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల

నరసన్నపేట, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి):

విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలు అమలు చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సాంకేతికంగా బోధన, వసతులు కల్పిస్తోంది. అయినా విద్యా ప్రమాణాలు మాత్రం ఆశించిన స్థాయిలో లేవని కేంద్ర నుంచి వచ్చిన రెండు సంస్థల సర్వేల్లో స్పష్టమైంది. 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల్లో సగం మందికి కూడికలు, తీసివేతలు కూడా రావడం లేదని, ఇంగ్లిష్ పదాలు చదవలేకపోతున్నారని నివేదికలు ఇచ్చాయి. ఈ నేపథ్యంలో మరింత వైవిధ్యంగా విద్యాప్రమాణాలు మెరుగుపరిచేలా మంత్రి నారా లోకేశ్, విద్యాశాఖ అధికారులు దృష్టి సారించారు. ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయనున్నారు. ఆ దిశగా అకడమిక్ కమిటీలను నియమించి, పాఠశాలలను పర్యవేక్షించాలని నిర్ణయించారు. కమిటీలను సైతం నియమిం చారు. కమిటీల పనితీరు, విద్యాప్రమాణాలు పెంపునకు తీసుకుంటున్న చర్యలపై 15 రోజులకోసారి రాష్ట్రస్థాయిలో సమీక్షించనున్నారు.

● జిల్లాలో 2,955 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో శాటిలైట్ పాఠశాలలు -17, ఫౌండేషన్ పాఠశాలలు -248, బేసిక్ ప్రైమరీ స్కూల్‌లు -1,682. మోడల్ ప్రైమరీ పాఠశాలలు -385, యూపీ పాఠశాలలు -198, ఉన్నత పాఠశాలలు -295, బేసిక్ ప్రైమరీతో కూడిన ఉన్నత పాఠశాలలు -89, మోడల్ స్కూల్‌తో కూడిన ఉన్నత పాఠశాలలు 41 ఉన్నాయి. వీటిలో విద్యా (మిగతా 7వ పేజీలో..)

బడిబాగుకు నిధులొచ్చాయ్!

- తొలివిడతగా జిల్లాకు రూ.3.08 కోట్లు

హిరమండలం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో గాడితప్పిన ప్రభుత్వ విద్యను పట్టాలెక్కించేందుకు కూటమి సర్కార్ చర్యలు తీసుకుంటోంది. సమస్యలు పరిష్కరిస్తూనే, పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తోంది. పాఠశాలల పునఃప్రారంభం రోజే విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం, ఇతర సామగ్రిని అందించింది. తాజాగా పాఠశాలల నిర్వహణకు సంబంధించి తొలివిడతగా జిల్లాకు రూ.3.08కోట్లు విడుదల చేసింది. జిల్లాలో 2,226 ప్రభుత్వ ప్రాథమిక, 427 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలకు రూ.1.88 కోట్లు, ఉన్నత పాఠశాలలకు రూ.1.20 కోట్లు చొప్పున నిర్వహణ నిధులు జమయ్యాయి. ప్రభుత్వం ఏడాదికి రెండుసార్లు ఇలా నిధులు జమ చేయనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఒకటి నుంచి 30 మంది ఉంటే రూ.10వేలు, 31 నుంచి 100 మందికి రూ.25వేలు, 101 నుంచి 250 మందికి రూ.50వేలు, 251 నుంచి వెయ్యి మంది వరకు రూ.75వేలు ఇంకా ఎక్కువ మంది విద్యార్థులు ఉంటే రూ.లక్ష వరకు నిర్వహణ నిధులు కేటాయిస్తారు.

● తీరనున్న అవస్థలు..

గత ప్రభుత్వం పాఠశాల నిర్వహణ నిధులు విడుదల చేయకపోగా, ప్రధానోపాధ్యాయుల ఖాతాల్లోని డబ్బును సైతం వెనక్కి తీసుకుంది. ఏ చిన్న పనికైనా ప్రధానోపాధ్యాయులు సొంత నగదు ఖర్చు చేసేవారు. 'నాడు-నేడు' పథకం కింద నిర్మించిన భవనాలు అసంపూర్తిగా వదిలేశారు. ప్రస్తుతం నిర్వహణ నిధులు జమకావడంతో పాఠశాలల్లో ఇబ్బందులు తీరుతాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. కిటికీలు, తలుపులు, విద్యుత్ మరమ్మతులకు వీటిని ఉపాధ్యాయులు ఉపయోగించనున్నారని హిరమండలం ఎంఈవో కె.రాంబాబు తెలిపారు. సుద్దముక్కలు, బ్లాక్‌బోర్డులు, డస్టర్లు తదితర వాటిని కొనుగోలు చేయనున్నారని వెల్లడించారు.

మండల విద్యాశాఖ కార్యాలయాలకు..

మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో నిర్వహణ కోసం నిధులు కేటాయించారు. జిల్లాలో 30 ఎమ్మార్సీలు ఉన్నాయి. ఒక్కో దానికి రూ.70వేలు కేటాయించారు. సమగ్ర శిక్ష ఉన్నతాధికారులు జారీ చేసిన ఉత్తర్వుల మేరకు కార్యాలయ నిర్వహణ ఖర్చులు కింద రూ.20 వేలు, టీఎల్ఎం గ్రాంటు రూ.15వేలు, ఇతర ఖర్చులకు రూ.20వేలు, సమావేశాలు, రవాణా చార్జీల కింద రూ.15వేలు ఖర్చు చేయాలని పేర్కొన్నారు. అలాగే ప్రతి నెల 3వ శనివారం నిర్వహించే స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల కోసం రూ.28,700 చొప్పున నిధులు కేటాయించినట్లు ఉన్నతాధికారులు తెలిపారు.



పెద్దకొజ్జిరీయలో సంచరిస్తున్న కోతులు

నేలరాల్చిన కొబ్బరికాయలు

ఉద్దానానికి కోతుల బెడద

- కొబ్బరి తోటలపై గుంపులుగా దాడి
- అధికారులు చర్యలు చేపట్టాలని రైతుల విజ్ఞప్తి

కంచిలి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఉద్దానంలోని ఓవైపు తెగుళ్లతో నష్టం వాటిల్లుతోందని దిగులు పడుతున్న కొబ్బరి రైతులకు మరోవైపు కోతుల బెడద వెంటాడుతోంది. వర్షాభావ పరిస్థితులతో కొబ్బరి దిగుబడి బాగా తగ్గి రైతులు దిగులు చెందుతున్నారు. ఉన్న కాస్త కొబ్బరి పంటను కోతులు, కొండముచ్చులు నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నడూ లేనివిధంగా సమీప ఒడిశా రాష్ట్రం నుంచి కోతులు గుంపులుగా ఉద్దానం ప్రాంతంలోకి చొరబడుతున్నాయి. ఇళ్లల్లో సామగ్రిని చిందరవందర చేస్తున్నాయి. చిన్న చిన్న సంఘటనలు మినహా కోతుల వలన ఎటువంటి నష్టాలు లేకపోవడంతో స్థానికులు వాటిని తరిమేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. కానీ ఇటీవల కంచిలి మండలంలోని పెద్దకొజ్జిరీయ, చిన్నకొజ్జిరీయ, మఖరాంపురం, శ్రీరాంపురం తదితర పరిసర ప్రాంతాల్లోని కొబ్బరి తోటల్లోకి కోతులు గుంపులుగా ప్రవేశించి రైతులకు నష్టం కల్గిస్తున్నాయి. కొబ్బరిచెట్లపైకి ఎక్కి కాయలను వలచి.. కిందకు వేసి పగలగొడుతున్నాయి. దీంతో పంట నాశనమవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాటిని వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తే తమపై దాడులకు దిగుతున్నాయని పేర్కొంటున్నారు. కోతుల బారి నుంచి తమను, పంటను సంరక్షించేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



శ్రీకాకుళంలో యువకుల సందడి

స్నేహమేరా.. జీవితం.. శాశ్వతం

7లో

● ఘనంగా స్నేహితుల దినోత్సవం

స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం

● ఆత్మీయ కలయికలతో ఆనందం
● స్నేహితులు, పాఠశాలల పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు
● జిల్లాలో సందడి చేసిన యువత


శ్రీకాకుళం కల్చరల్: ఎంహెచ్ స్కూల్ 1976 సంవత్సరం విద్యార్థులు

స్నేహితుల దినోత్సవం సందర్భంగా స్నేహితులు, వివిధ పాఠశాలల పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాలు ఆదివారం ఆనందోత్సాహాల నడుమ నిర్వహించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుని ఆనందం పొందారు. వివిధ సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆటపాటలతో అలరించారు. శ్రీకాకుళం నగరంలో చిన్నారులు, యువతీ యువకులు సందడి చేశారు. ఒకరినొకరు పలుకరించుకుని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

- ఆంధ్రజ్యోతి బృందం


ఇచ్ఛాపురం: మొక్కలు నాటేందుకు సిద్ధమవుతున్న ఎలియన్స్ క్లబ్ సభ్యులు


ఇచ్ఛాపురం: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999-2000లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు


అరసవల్లి: ఆదిత్యాలయం ఎదుట సెల్ఫీ తీసుకుంటున్న స్నేహితురాళ్లు


కవిటి: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1984 నుంచి 1990 వరకు చదువుకున్న విద్యార్థులు


టెక్కలి: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2009-10 మధ్య చదివిన పదో తరగతి విద్యార్థులు


హిరమండలం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1986-93 మధ్య 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకున్న విద్యార్థులు


అరసవల్లి: స్నేహం కోసం మేమంతా..

న్యూస్ బాక్స్

పోలీస్ ఉద్యోగమంటే ఇష్టం

● నేవీ ఉద్యోగం వదిలేసిన రాజేష్



సోంపేట రూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పోలీస్ ఉద్యోగం ఇష్టమంటూ కొర్లాం గ్రామానికి చెందిన బంగారు రాజేష్ పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన ఆయన ఇండియన్ నేవీలో 2022లో వచ్చిన ఉద్యోగాన్ని ఆరు నెలలు పనిచేసి వదిలేశారు. పోలీసు శాఖలో పని చేయాలన్న సంకల్పంతోనే నేవీకి రాజీనామా చేశానన్నారు. సాధన చేస్తే సాధించలేనిదీ ఏదీ లేదని, తాను మళ్లీ పోలీస్ అవ్వాలన్న లక్ష్యం వదుకోలేదని, కష్టపడి చదివి తొలి ప్రయత్నంలోనే సివిల్ పోలీస్‌గా ఎంపికవడం ఆనందంగా ఉందన్నారు. ఇతని తండ్రి బంగారు పున్నయ్య మిల్లులో దినసరి కార్మికుడిగా పనిచేస్తున్నారు. రాజేష్‌ను మిత్రులు, గ్రామస్థులు అభినందించారు.

నవోదయ శిక్షణా తరగతులు ప్రారంభం

సోంపేట రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మామిడిపల్లిలోని భగత్ సింగ్ గ్రంథాలయ ఆధ్వర్యంలో నవోదయ శిక్షణా తరగతులు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఐదో తరగతి విద్యార్థినీ విద్యార్థులకు అందిస్తున్న స్థానిక ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సంస్థ అధ్యక్షుడు లండ బాబూరావు కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి జుత్తు సింహాచలం, ప్రతినిధులు మర్రి లోకనాథం, మామిడిపల్లి పూర్వ విద్యార్థి సంఘం గౌరవాధ్యక్షుడు సాహుకారి కోదండరాం, గ్రంథాలయం అధ్యక్షుడు గొరకల నాగేశ్వరరావు తదిత రులు పాల్గొన్నారు.

తారురోడ్డుకు భూమి పూజ

సోంపేట రూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మామిడిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం సూర్య వాసవీధి నుంచి చిన్న మామిడిపల్లి వరకు ఉపాధి నిధులతో నిర్మించన్ను తారురోడ్డు పనులకు ఆదివారం భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చంద్రమోహన్, నూకల సోమేశ్వరరావు, తిమ్మల వీరా స్వామి, దున్న వీరాస్వామి, గొరకల మోహన్, సంగారు త్రినాథ్, సంగారు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బైరిపురంలో బోరు ప్రారంభం

కవిటి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): బైరిపురం రామాలయం వద్ద ఏర్పాటు చేసిన మంచినీటి బోరును ఎమ్మెల్సీ ఎన్.రామారావు ఆదివారం ప్రారంభించారు. మండలపరిషత్ నిధులతో ఏర్పాటు చేశామన్నారు. అనంతరం బైరిపురం, రాజపురం గ్రామాల్లో బాబుష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం చేపట్టారు. పలువురు నేతలు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ కార్యవర్గం ఎన్నిక

ఇచ్ఛాపురం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం బీఎస్ఎస్ ఆటో యూనియన్‌ను ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా నీలాపు ప్రకాష్‌రెడ్డి (చిన్న), ఉపాధ్యక్షుడిగా ఎస్.మాధవ రెడ్డి, సెక్రటరీగా కె.తులసీ, ట్రెజరర్‌గా మధు, జాయింట్ సెక్రటరీగా పీసీ సాహు ఎన్నికయ్యారు. ఆటో యూనియన్ మాజీ అధ్యక్షుడు కొండా శంకర్ రెడ్డి, అనపాన బైరాగిరెడ్డి ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు జరిగాయి. కార్యక్రమంలో పలువురు ఆటో డ్రైవర్లు, యజమానులు పాల్గొన్నారు.

మరింత వై'విద్య'ంగా..

(ఐదో పేజీ తరువాయి)

ప్రమాణాల పెంపు, పర్యవేక్షణకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తున్నారు. ఇందుకోసం జిల్లా, మండలస్థాయిల్లో అకడమిక్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాస్థాయిలో డీఈవో ఛైర్మన్‌గా, సమగ్రశిక్ష ఏపీసీ, ఏసీ, డీసీఈబీ కార్యదర్శి, ముగ్గురు ఎంఈవోలు సభ్యులుగా ఉంటారు. ప్రతి సబ్జెక్టుకు నలుగురు నిపుణులైన స్కూల్ అసిస్టెంట్లు చొప్పున 24 మంది టీచర్లను, ప్రాథమిక స్థాయిలో 1నుంచి 5వ తరగతి వరకు పర్యవేక్షణకు జిల్లాస్థాయి కమిటీలో నలుగురు ఎస్జీటీ కేడర్‌లో నిపుణులైన టీచర్లకు అవకాశం కల్పించారు. మండల స్థాయిలోనూ నిరంతరం పర్యవేక్షణకు ఎంఈవో-1, ఎంఈవో-2, కాంప్లెక్స్ హెచ్ఎం, ముగ్గురు ఎస్జీటీలకు కమిటీలో అవకాశం ఇచ్చారు. జిల్లా కమిటీ సభ్యులు బృందాలుగా పాఠశాలలను పర్యవేక్షిస్తారు. విద్యార్థుల సామర్థ్యాలు, ప్రమాణాల పెంపునకు ఎలా బోధిస్తున్నారు?. ఎన్‌రోల్‌మెంట్, విద్యార్థులు, టీచర్ల హాజరు, పాఠశాలలకు వచ్చిన నిధులు.. వాటితో ఎలాంటి వసతులు కల్పించారు? తదితర వివరాలను పరిశీలిస్తారు. తనిఖీ చేసిన పాఠశాలలోని పరిస్థితులను కమిటీ రాసుకోవాలి. 15 రోజులకోసారి అకడమిక్ కమిటీలతో రాష్ట్రస్థాయిలో మంత్రి నారా లోకేశ్, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్ సమీక్ష నిర్వహిస్తారు. కమిటీల పనితీరు, గుర్తించిన సమస్యలపై ఆరా తీస్తారు. ఆ దిశగా ఇప్పటికే కమిషనర్ నుంచి ఆదేశాలు రావడంతో జిల్లాలో అమలుకు అధికారులు కుస్తీ పడుతున్నారు.

'రైతు సేవ'లకు దూరం!

(ఐదో పేజీ తరువాయి)

తీసుకురావాల్సిన ఏజెన్సీ కనిపించడం లేదు. ప్రస్తుతం వీఏఏలు సెల్‌ఫోన్ ద్వారా పనులు చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ తీరుతో టీవీలు, కియోస్క్ యంత్రాల కంపెనీలకు లబ్ధి చేకూరింది తప్ప.. తమకు ప్రయోజనం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి భవనాల నిర్మాణాలు పూర్తిచేయాలని, సేవలు సక్రమంగా అందజేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

హెచ్ఎంల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

అరసవల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక సంఘ భవనంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా వాల్తేటి సత్యనారాయణ, యర్నాగుల వాసుదేవరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కౌన్సిలర్లుగా పేడాడ దాలినాయుడు, ఎస్.లక్ష్మణరావు, బి.రమణయ్య, ఆర్థిక కార్యదర్శిగా చిలుకు కృష్ణారావు, ఉపాధ్యక్షులుగా సామవేదుల రమణ, ఎస్.కుమారస్వామి, సనపల రామకృష్ణ, డివిజన్ కార్యదర్శులుగా చిక్కాల జగన్నాథరావు, ఎస్.ఎర్రన్నాయుడు, బి.వైకుంఠరావు ఎన్నికయ్యారు. పరిశీలకుడిగా విజయ నగరం జిల్లా ప్రధాన కార్యదర్శి సన్యాసిరాజు వ్యవహరించారు.

హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలి

ఇచ్ఛాపురం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆర్ఎస్ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర ప్రచారక్ భరత్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాలలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మండల సాంఘిక్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గణపతిరావు, వెచ్చా కేశవరావు, పాక తులసీదాస్‌రెడ్డి, వీహెచ్‌పీ ప్రఖండ అధ్యక్షుడు గొనప దానప్ప, ఆర్ఎస్ఎస్ ద్విఖండ సంఘచాలకులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ జామ్‌తో అవస్థలు


రైల్వే స్టేషన్ ఎదురుగా నిలిచిన వాహనాలు

కంచిలి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కంచిలి రైల్వేస్టేషన్ సమీపంలో ట్రాఫిక్ జామ్ కావడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనాలు, ఆటోలు రోడ్డుకు అడ్డంగా పెట్టడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. బస్సులు సైతం ఒకేసారి రావడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. పోలీసులు జోక్యం చేసుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు.

కంచమ్మ తల్లి సంబరాల ఆదాయం రూ.1,42 లక్షలు

కంచిలి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కంచిలి గ్రామదేవత కంచమ్మతల్లి సంబరాలకు సంబంధించిన ఆదాయ, వ్యయాలపై ఆదివారం కమిటీ సమావేశం శ్రీరాముని సన్నిధిలో నిర్వహించారు. రూ.1,42,15,113 ఆదాయం రాగా రూ.1,14,44,526 ఖర్చయినట్లు నిర్ణయించారు. ఆదాయ, వ్యయాలను చర్చించి రూ.27,70,587 మిగిలినట్లు ప్రకటించారు.

రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు జిల్లా జట్ల ఎంపిక



శ్రీకాకుళం స్పోర్ట్స్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి చదరంగం పోటీ లకు జిల్లా జట్ల ఎంపిక పోటీ ఆదివారం నిర్వహించారు. స్థానిక కొత్తరోడ్డు వద్ద ట్రస్టు కార్యాలయంలో నిర్వహించిన పోటీలకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో రేటెడ్ క్రీడాకారుడు బి.యశ్వంత్ ప్రథమస్థానం పొందగా బి.జీవన్, డి.తారకేశ్వరరావు, జె.సుహాస్ వరుస స్థానాల్లో నిలిచారు. బాలికల విభాగంలో బి.శృతి, ఎం.తీక్షణ, గీతిక విజేతలుగా నిలిచారు. వీరంతా ఈనెల 9, 10వ తేదీల్లో కర్నూలులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలకు ఆర్బిటార్‌గా సనపల భీమారావు వ్యవహరించారు. విజేతలకు కమిటీ సభ్యులు రామాంజనేయులు, జె.రమేష్ తదితరులు బహుమతులు అందజేశారు.

కాంట్రాక్టు ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలి

● సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర చైర్మన్ బి.కాంతారావు



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర చైర్మన్ కాంతారావు

అరసవల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగుల సంఘం రాష్ట్ర చైర్మన్ బి.కాంతారావు డిమాండ్ చేశారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోసం 'చలో విజయవాడ' కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, హెచ్ఆర్ పాలసీని అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని, ఉద్యోగుల పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, కేజీబీవీ ప్రిన్సిపాళ్లపై రాజకీయ ఒత్తిడులు నివారించాలని కోరారు. సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షుడు పి.తేజేశ్వరరావు, జిల్లా నాయకులు ఎల్‌వీ రమణ, ఎం.ఉమాపతి, లోకేశ్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

60 మంది కార్మికులను చేర్చుకోవడం అభినందనీయం


ఐక్యత చాటుకున్న సీఐటీయూ, కార్మిక సంఘ నాయకులు

లావేరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): శ్యాంపిస్టన్స్‌లో గత కొంతకాలం కిందట తొలగించబడిన 60 మంది కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవడం ఆనందంగా ఉందని సీఐటీయూ పూర్వ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.గోవిందరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు, పరిశ్రమ కార్మిక సంఘం నేతలు అన్నారు. ఆదివారం బుడుమూరులోని ఓ కల్యాణ మండ పంలో శ్యాంపిస్టన్ పరిశ్రమ-3లో సీఐటీయూ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ.. కార్మికుల పక్షాన సీఐటీయూ నిలిచి పోరాడుతుందన్నారు. పరిశ్రమ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పి.శ్రీను బాబు, దుర్గారావు, మహేష్, అప్పలనాయుడు, చక్రధర్, పలువురు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలో పతకాలు

●విజేతలకు అభినందన

ఇచ్ఛాపురం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): విజయవాడ రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరిగిన జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు ఆదివారం విద్యార్థులను పట్టణ ప్రముఖులు అభినందించారు. సబ్ జూనియర్స్ విభాగంలో పిలక లాస్యన్ రెడ్డి, మహేష్, జోషిక, కృతిజ్ఞ, ఉపాసన బంగారు పతకాలు సాధించగా, భవిష్య వర్షిని, సత్యశ్రీ, యశ్వంత్, సాయి సిద్ధార్థ రజిత పతకాలు సాధించారు. సోనాక్షి, సాయి, చాణిక్య, అభిరామ్ కాంస్య పతకాలు పొం దారు. సబ్ జూనియర్ రెగ్యులర్ కేటగిరిలో యశ్విత బంగారు, హర్షిని రజిత పతకాన్ని సొంతం చేసుకున్నారు. క్యాడేట్ విభాగంలో పటాన దమయంతి బంగారు, చెన్నూరి జాహ్నవి రజిత పతకాలు సాధించారు. జూనియర్స్ విభాగంలో సీహెచ్ గిరి కాస్య పతకం సాధించగా సీనియర్ విభాగంలో ఎ.భువనేశ్వరి రజిత, ఎ.డోలి కాంస్య పతకం పొందారు. పూమ్సే విభాగంలో ఎ.డొలి రజిత, సత్రశ్రీ, ఎ.కృతజ్ఞ కాంస్య పతకాలు సాధించారు. అభినందన కార్యక్రమంలో డా.ఉలాల శేషయాదవ్, విజయ్‌భాస్కర్ రెడ్డి, సుగ్గు ప్రేంకుమార్, చాట్ల తిరుపతి, యువ సూర్యచారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎం.రాంబాబు, కోచ్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అన్నమాచార్య సంకీర్తనలు

అరసవల్లి ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పీఎన్‌కాలనీ వరసిద్ధి వినాయక పంచాయతన దేవాల యంలో ఆదివారం అన్నమాచార్య సంకీర్తన గానలహరి అలరించింది. స్వరాత్మక సంగీత విద్యాపీఠం నిర్వాహకుడు కేవీ ఉమామహేశ్వరరావు సంకీర్తన గానయజ్ఞం 37వ రోజు అన్నమాచార్య కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, పీవీఆర్ఎం పట్నాయక్, నిక్కు అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుల దినోత్సవంపై కవితాగానం

శ్రీకాకుళం కల్చరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో తెలుగు రచయితల వేదిక (తెరవే) ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం సందర్భంగా కవులు, రచయితలు కవితలు ఆలపించారు. సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, రఘుపాత్రుని వెంకటరమ ణమూర్తితో పాటు 14 మంది కవులు తాము రచించిన కవితలను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఐఎన్‌డీ ప్రసాద్, ఇద్ది పాపయ్య, ఎల్.సత్యానంద్, ముట్నూరు ఉపేంద్ర శర్మ, పూడి జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కవిటి మండలం సీమురు గ్రామానికి చెందిన శివంగి నీలవేణి (55) రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. నీలవేణి గత 15 ఏళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. ఆమెను గతనెల 31న శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు చేర్చారు. అయితే ఏమైందో ఏమో గాని ఆదివారం మేడపై నుంచి పడిపోయింది. అయితే చికిత్స అందించినా ఫలితం లేకపోయింది. శ్రీకాకుళం రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బాలికల గురుకులాల్లో మహిళా ఉద్యోగులనే నియమించాలి

● హోంమంత్రికి దళిత జేఏసీ నాయకుల వినతి

అరసవల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): బాలికల గురుకులాల్లో మహిళా ఉద్యోగులను మాత్ర మే నియమించాలని దళిత సంఘాల జేఏసీ నేతలు కోరారు. ఆదివారం అరసవల్లి ఆది త్యుని దర్శించుకునేందుకు వచ్చిన హోంమంత్రి వంగలపూడి అనితను నేతలు కలిసి వినతి పత్రం అందించారు. గురుకులాలకు నాసిరకం కూరగాయలు, చికెన్, సరుకులు సరఫరా చేస్తున్నారని, అలాగే విద్యార్థులకు సరిపడా భవనాలు లేవని, కొన్ని చోట్ల శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉన్నాయని ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. గురుకులాల పర్యవేక్షణకు ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని కోరారు. సమ స్యలపై మంత్రి సానుకూలంగా స్పం దించారని వారు తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో దళిత సంఘాల జేఏసీ కన్వీ నర్ దుర్గాసి గణేష్, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు, నేతలు లోపింటి తేజేశ్వరరావు, కానుకుర్తి గోవింద, సమతా సైనిక్ దళ్ నాయకులు సీర రాము, కమల తదితరులు పాల్గొన్నారు.

కొజ్జిరియా జంక్షన్‌లో 21 అడుగుల స్తంభం

● పనులకు భూమిపూజ
● ఆ తరువాత వేమన విగ్రహం ఏర్పాటు


శంకుస్థాపనలో పాల్గొన్న రెడ్డి కుల సంఘ నేతలు

కవిటి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రెడ్డి సంఘం ఏర్పడి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా కొజ్జిరియా జంక్షన్‌లో 21 అడుగుల స్తంభం, వేమన విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంఘ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు పనులకు ఆదివారం భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఆశి చిరంజీవులు రెడ్డి, దుర్గాశి పాపారావు, ఆశి లీలారాణి, బుడ్డెపు కామేష్, సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, తిమ్మరుషి రెడ్డి, మణిచంద్రప్రకాష్, తిప్పన దుర్యోధన రెడ్డి, దక్కత డిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

పొందూరు ఇన్‌చార్జి ఎంఈవోగా వాగ్దేవి



పొందూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పొందూరు ఇన్‌చార్జి ఎంఈవోగా ఎం.వాగ్దేవిని నియమించారు. ఈమె ఇటీవల శ్రీకాకుళం నుంచి పొందూరు ఉన్నత పాఠశాలకు హెచ్ఎంగా బదిలీ అయి లావేరు ఎంఈవో (ఎఫ్ఏసీ)గానూ వ్యవహరిస్తున్నారు. ఈమెను ఇక్కడకు ఇన్‌చార్జి ఎంఈవోగా నియమిస్తూ పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

వైసీపీ నాయకులపై ప్రజలకు విశ్వాసం లేదు

పొందూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేరు స్తోందని, అయితే వైసీపీ నాయకులు మోసం గ్యారెంటీ అంటూ దుష్ప్రచారం చేస్తున్నారని, అయినా వారిపై ప్రజలకు విశ్వాసం కలగడం లేదని టీడీపీ మండల నేతలు అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీని, పార్టీ అధినేత జగన్ రెడ్డిని, నాయకులను రాష్ట్ర ప్రజలు ఏమాత్రం నమ్మడం లేదన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, ఏఎంసీ మాజీ చైర్మన్ అన్నెపు రాము, తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కర్, పట్టణ అధ్యక్షుడు అనకాపల్లి చినరంగ తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోండి

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదిక (గ్రీవెన్స్)ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో కోరారు. అర్జీదారులు తమ అర్జీలను మీకోసం.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని, అలాగే ఇప్పటికే చేసిన ఫిర్యాదుల పరిస్థితిని 1100 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

తాళాలు వేసిన ఇళ్లే వారి టార్గెట్

- ముగ్గురు ఒడిశా దొంగల అరెస్టు
- బంగారం, వెండి ఆభరణాలతోపాటు రూ.50వేలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వెంకట అప్పారావు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకట అప్పారావు

పలాస, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): తాళాలు వేసిన ఇళ్లపై రెక్కీ నిర్వహించి అర్ధరాత్రి దాటిన తరువాత ఆ ఇంటిలోకి ప్రవేశించి దొంగతనాలకు అలవాటు పడిన ఒడిశాకు చెందిన ముగ్గురు అంతరాష్ట్ర దొంగలను కాశీబుగ్గ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.50 వేలు నగదు, 58 గ్రాముల బంగారు, 450 గ్రాముల వెండి ఆభరణాలు, మూడు సెల్‌ఫోన్లు, రెండు బైక్‌లు, దొంగతనానికి వినియోగించే పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు ఆదివారం ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన సంతోష్ సాహు, రాజ్‌కుమార్ సేథి, బబుల్లా సేథి ముగ్గురు కలసి వివిధ దొంగతనాలకు పాల్పడ్డారు. వీరిపై ఒడిశా రాష్ట్రంలో దొంగతనాలు చేసి పట్టుబడడంతో జైలు జీవితాన్ని అనుభవించారు. సంతోష్ సాహుకు చిత్రాపూర్ జైలులో ఉండగా రాజ్‌కుమార్ సేథి పరిచయం అయ్యాడు. రాజ్‌కుమార్, బబుల్లాసేథిలు చిలక సరస్సు వద్ద ఓ హోటల్‌లో పరిచయం అయ్యారు. వీరి సంపాదన ఎందుకూ సరిపోకపోవడంతో దొంగతనాలు చేసి డబ్బులు సంపాదించేందుకు అలవాటు పడ్డారు. ద్విచక్ర వాహనాలు, చైన్ స్నాచింగ్‌లు, ఇంటిలో చొరబడి దొంగతనాలు చేయడానికి అలవాటుపడ్డారు. ఈ క్రమంలో వీరు ముగ్గురు ఒడిశా పోలీసులకు పట్టుబడడంతో అక్కడ జైలుశిక్ష అనుభించారు. అక్కడ నుంచి విడుదలైన తరువాత ఆంధ్రాలో దొంగతనాలు చేయడానికి నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో పలాస మండలం లక్ష్మీపురం గ్రామంలో అల్లు కృష్ణవేణి అనే మహిళ ఇంటిని ఎంచుకున్నారు. గత నెల 17వ తేదీ రాత్రి ఆమె తన కుమార్తె ఇంటికి వెళ్లి నిద్రించింది. ఆ ఇంటిలో ఎవరూ లేరన్న విషయాన్ని గుర్తించి పై ముగ్గురూ ఆ ఇంటి తలుపులు బద్దలు కొట్టి బీరువాలో ఉన్న వెండి వస్తువులు దొంగిలించారు. దీనిపై కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ కేసు నమోదు చేసి దొంగల కోసం ప్రత్యేక బృందాలను నియమించారు. ఈ క్రమంలో ఆదివారం కోసంగిపురం జాతీయ రహదారి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఈ ముగ్గురు దొంగలు రెండు ద్విచక్ర వాహనాలపై వస్తుండగా వారిని ప్రశ్నించడంతో అసలు విషయం బయట పెట్టారు. లక్ష్మీపురం కేసుతో పాటు పలాస మండలం పెద్దనారాయణపురం గ్రామం వద్ద రెండు దొంగతనాలు, రెండు చైన్ స్నాచింగ్ కేసులు, పలాస వివేకానంద కాలనీలో రోబరీలో వీరు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. సాంకేతిక పరిజ్ఞానంతో వీరు చేసిన నేరాలు రుజువైనట్టు డీఎస్పీ తెలిపారు.

సమాచారం ఇవ్వండి

వేరే గ్రామాలకు వెళ్లినప్పుడు తమకు సమాచారం ఇస్తే పోలీసు పహరా ఏర్పాటు చేస్తామ డీఎస్పీ వెంకటఅప్పారావు తెలిపారు. విలువైన వస్తువులు భద్ర పరచాలని, లేకుంటే ఇంటికి సీసీ కెమెరాలు అమర్చుకొని రక్షణ కల్పించాలని కోరారు. దొంగతనాలు జరగకుండా రాత్రులు గస్తీ పెట్టామని, ప్రజలు కూడా తమవంతు సహాయంగా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఒడిశా దొంగలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ, ఎస్ఐ నర్సింహమూర్తి, పోలీసులు శ్రీనివాసరావు, గవరయ్య, నీలకంఠం, ఉషాకిరణ్‌ను ఆయన అభినందించారు.

పుస్తెలతాడు అపహరణ

ఎచ్చెర్ల, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఫరీద్‌పేట పంచాయతీ వరం కాలనీకి చెందిన ఎల్లాపంతుల వరలక్ష్మి మెడలోని రెండున్నర తులాల బంగారం పుస్తెలతాడును గుర్తుతెలియని వ్యక్తి అపహ రించాడు. రోజూ మాదిరిగానే ఆమె ఆదివారం ఉదయం 6.30 గంటల సమయంలో వాకింగ్ చేస్తుండగా ఇదే కాలనీలోని ఒకటో నెంబరు రోడ్‌లో వెనుక నుంచి వ్యక్తి నడుచుకుంటూ వచ్చి ఆమె మెడలోని పుస్తెలతాడును లాక్కొని పారిపోయాడు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు.

గ్రామానికి చేరిన మత్స్యకారుడి మృతదేహం

వజ్రపుకొత్తూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): హుకుంపేట గ్రామానికి చెందిన మత్స్యకారుడు కారి రాజులు గోవా సముద్ర తీరంలో శుక్రవారం చేపలవేట చేస్తూ పడవబోల్తా పడిన ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు రాజులు మృతదేహం ఆదివారం స్వగ్రామం హుకుంపేట చేరుకుంది. ఆ మేరకు కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపించారు. అందరితో సన్నిహితంగా ఉండే రాజులు అకాల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైంది


ప్రతాప్ మాస్టర్ దంపతులకు సన్మానిస్తున్న ఎంపీపీ తదితరులు

కోటబొమ్మాళి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదని ఎంపీపీ రోణంకి మల్లేశ్వరరావు, జడ్పీటీసీ దుబ్బ వెంకటరావు అన్నారు. 30 ఏళ్ల ఉపాధ్యాయుడిగా, ఆరేళ్లు ఎంఈవోగా పనిచేసి పదవీవిరమణ చేసిన ఎల్‌వీ ప్రతాప్ మాస్టర్ సత్కార సభ ఆదివారం స్థానిక ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రతాప్ మాస్టర్‌ను ఘనంగా సత్కరించారు. డిప్యూటీ డీఈవో విల్సన్, ఎంఈవో గోవిందరావు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసు డాగ్‌తో విస్తృత తనిఖీలు


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

పాతపట్నం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కేనిన్ డాగ్‌తో పోలీసులు ఆదివారం విస్తృతంగా తనిఖీలు చేశారు. స్థానిక ఆర్‌టీసీ కాంప్లెక్స్‌లో వాహనదారుల బ్యాగ్‌లను అలాగే చెక్‌పోస్టుల వద్ద ప్రధాన రహదారికి ఇరువైపులా ఉండే దుకాణాలను, వాహనాలను తనిఖీ చేశారు. నిషేధిత పదార్థాలపై డాగ్‌తో పరిశీలించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం


అపస్మారక స్థితిలో ఉన్న అనూష

టెక్కలి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి మండలం బాణాపురం గ్రామానికి చెందిన వివాహిత దుంప అనూష ఆదివారం ఉదయం డమర సమీపంలో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. నోటి నుంచి నురగలు కక్కుతూ రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో పడివున్న ఆమె స్థానికులు గుర్తించి 108 వాహనంలో జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. అయితే ఆమెకు వైద్యులు ప్రథమ చికిత్స చేసి ప్రాణాపాయం నుంచి రక్షించగలిగారు. ఈ మేరకు టెక్కలి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

షట్టర్లు ఇలా.. సాగునీరు ఎలా?


పెద్దదూగాం వద్ద మరమ్మతులకు గురైన షట్టర్లు

జలుమూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): వంశధార ప్రధాన ఎడమ కాలువపై ఏర్పాటు చేసిన షట్టర్లు పనిచేయకపోవడంతో పిల్లకాలువల్లో పూర్తి స్థాయిలో సాగునీరందక రైతులు ఇబ్బందిపడుతున్నారు. వంశధార ఎడమ ప్రధాన కాలువ ఏర్పాటు చేసినప్పుడు ఈ షట్టర్లు ఏర్పాటు చేశారు. అప్పటినుంచి ఇప్పటివరకు షట్టర్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో తుప్పుపట్టి పనిచేయక రైతులుకు సాగునీరందక అనేక అగచాట్లు పడుతున్నారు. పెద్దదూగాం వద్ద కాలువపై ఏర్పాటు చేసిన షట్టర్లు పనిచేయకపోవడంతో కాలువలో కొద్ది పాటి నీటి ప్రవాహం వచ్చినప్పుడు 19ఆర్, 23ఆర్, 22ఆర్ తదితర పిల్లకాలువలకు సాగునీరందక ఖరీఫ్ కష్టాలు తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. కరవంజ, హుస్సేనుపురం, తాళ్లవలస, తమ్మయ్యపేట తదితర గ్రామాలకు చెందిన వందలాది ఎకరాలకు సాగు నీరందక రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఇప్పటికైనా వంశధార అధికారులు స్పందించి షట్టర్లు మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు.

రైతులకు అందుబాటులో మార్కెట్ కమిటీలు

- ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వం హాయంలో మార్కెట్ కమిటీలను రైతులకు అందుబాటులో తీసుకురావడం జరుగుతుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక మార్కెట్ కమిటీ పాలకవర్గంచే ప్రమాణస్వీకరణ కార్యాక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సమావేశంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడారు. మార్కెట్ కమిటీల ఉత్సవ మూర్తులుగా కాకుండా క్రియాశీలకంగా పనిచేయాలన్నారు. రైతుబంధు పథకం పై రైతులకు అవగాహన చేయాలని సూచించారు. అంతకు ముందు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా పాగోటి ఉమామహేశ్వరి చేతి ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో నియోజవర్గ టీడీపీ సమన్వయకర్త బగ్గు అర్చన, పీఏసీఎస్ అధ్యక్షులు బైరి భాస్కరరావు, శిమ్మ చంద్రశేఖర్, తంగుడు నాగేశ్వరరావు, సాసుపల్లి కృష్ణబాబు, రోణంకి కృష్ణంనాయుడు, గొద్దు చిట్టిబాబు, జామి వెంకట్రావు, పీస కృష్ణ, నారాయణదాసు, కరుకుల రమేష్, ఎంవీ నాయుడు, కత్తిరి వెంకటరమణ, ముద్దాడ నరసమ్మ పాల్గొన్నారు.

మాజీ మంత్రి ప్రోత్సాహంతోనే సోషల్ మీడియా దాడి

- పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష


క్లిప్పింగులు చూపిస్తున్న ఎమ్మెల్యే శిరీష

పలాస, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): తన కుటుంబం, తనపై వ్యక్తిగతంగా మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ప్రోత్సాహంతో ఆయన అనుచరగణం సోషల్ మీడియా వేదికగా దాడి చేస్తున్నారని ఎమ్మెల్యే గౌతు శిరీష ఆరోపించారు. ఆదివారం ఆమె స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అప్పుడు అధికారంలో ఉన్నా.. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నా వారి వికృత చేష్టలు ఆపడం లేదని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళలపై సోషల్ మీడియాలో విమర్శలు చేస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని, ఈ విషయంలో హోంమంత్రి అనిత ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పలాస మండలం సున్నాదేవి గ్రామానికి చెందిన దివ్యాంగుడు దున్న బాలకృష్ణ తనపై సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని వాటి క్లిప్పింగులు ప్రదర్శించారు. అతడిపై చర్యలు తీసుకోవాలని కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. తాను తప్పుడు విమర్శలకు భయపడేది లేదని, వ్యక్తిగతంగా తన భర్త, కుటుంబాన్ని సోషల్ మీడియా వేదికగా పోస్టింగులు పెట్టడంపై ఆవేదన వ్యక్తం చేశారు.

మాజీ మంత్రి విమర్శలను అడ్డుకున్న టీడీపీ శ్రేణులు

వజ్రపుకొత్తూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మంచినీళ్లపేటలో ఆదివారం సాయంత్రం మాజీమంత్రి అప్పలరాజు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేస్తున్న ప్రచారాన్ని టీడీపీ శ్రేణులు అడ్డుకొని నిలదీశాయి. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరుగగా ఎస్ఐ బి.నిహార్ చేరుకొని వివాదానికి తెరదించారు. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం సాయంత్రం మాజీ మంత్రి అప్పలరాజు వైసీపీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించగానికి మంచినీళ్లపేట గ్రామానికి వచ్చారు. అనంతరం గ్రామంలో వైసీపీ శ్రేణులు నిర్వహిస్తున్న బాబుష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని సూపర్‌సిక్స్ పథకాలపై మైక్‌లో విమర్శించారు. దీంతో స్థానిక మాజీ సర్పంచ్ గుల్ల చిన్నయ్య, ఆకుల పాపారావులతో పాటు మరికొంత మంది టీడీపీ నాయకులు అక్కడికి చేరుకుని గ్రామంలో ఎవరికి అన్యాయం జరిగిందో చెప్పాలని మాజీ మంత్రిని నిలదీశారు. దీంతో ఇరు వర్గాల మధ్య మాటల యుద్ధం సాగింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ సిబ్బందితో అక్కడికి చేరుకొని పరిస్థితిని అదుపుచేశారు. ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించి వేయడంతో వివాదం సద్దుమనిగింది.

స్మార్ట్ మీటర్లు రద్దుచేయాలి

నందిగాం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ చార్జీలు రద్దుచేయాలని సీపీఎం డివిజన్ ప్రధాన కార్యదర్శి నంబూరు షన్ముఖరావు డిమాండ్ చేశారు. ఆదివారం నందిగాంలో ఈనెల 7న విజయవాడలో విద్యుత్ చౌరాలో నిర్వహించనున్న ధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 5న విద్యుత్ సబ్‌స్టేషన్ ధర్నా చేయనున్నామని, వినియోగదారులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సీపీఎం నాయకులు పి.సాంబమూర్తి, ఎం.దాలయ్య, డి.మల్లేశ్వరరావు, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి యోగా పోటీలు



నరసన్నపేట, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): యోగాసన స్పోర్ట్సు అసోయేషన్ ఆఫ్ శ్రీకాకుళం జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలు ఉత్సాహంగా సాగాయి. జిల్లా నలుమూలు నుంచి వందలాది మంది పాల్గొని తమ ప్రదర్శనలు చేశారు. ఈ పోటీలను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రారంబించారు. ప్రతీ వ్యక్తి జీవనంలో యోగా భాగస్వామ్యం కావాలన్నారు. విజేతలకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి బహుమతులు ప్రదానం చేశారు. రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు కొందర్ని ఎంపిక చేశారు. కార్యక్రమంలో బగ్గు అర్చన, బొత్స కేదార్‌నాథ్, కింజరాపు రామారావు, సదాశివుని రవి, పాఠశాల హెచ్ఎం పి.వెంకట్రావు, దుంపల చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ' నిధులు విడుదలపై హర్షం


చంద్రబాబు చిత్ర పటానికి పాలభిషేకం చేస్తున్న రైతులు, టీడీపీ శ్రేణులు

సంతబొమ్మాళి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ అందించడంపై మండల రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఏడాది లోపే అమలు చేయడం జరిగిందన్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్, అచ్చెన్నాయుడు చిత్రపటాలకు పాలబిషేక చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రైతులు పాల్గొన్నారు.

బాధితునికి న్యాయం చేయాలి

జలుమూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): టెక్కలిపాడు గ్రామానికి చెందిన దళితుని భూమి అదే గ్రామానికి చెందిన పెత్తందారుడు ఆక్రమించుకున్నాడని జిల్లా అధికారులు స్పందించి విచారణ చేపట్టి బాధితుడికి న్యాయం చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. తనకు 1976లో ప్రభుత్వం 5 సెంట్లు భూమికి పట్టాలిచ్చి ప్రభుత్వ సాయంతో పక్కా ఇళ్లు నిర్మించుకొన్నానని పెరటిలో మిగిలి ఉన్న ఒక సెంటు భూమి గ్రామానికి చెందిన పెత్తందారు ఆక్రమించుకొన్నాడని బాధితుడు రమణ ప్రజా సంఘాలకు ఫిర్యాదు చేశారు. దీనిపై వారు స్పందించి వారు పరిశీలించారు. ఈ ఆక్రమణపై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఆర్.సురేష్‌బాబు అసహనం వ్యక్తం చేశారు. బాధితుడికి న్యాయం చేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వివిధ సంఘాల ప్రతినిధులు సింహాచలం, నర్సింహులు, సవరయ్య, తలసముద్రం మోహనరావు ఉన్నారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి


కాశీబుగ్గ: పత్రిక ప్రతులను దగ్ధం చేస్తున్న టీడీపీ శ్రేణులు

కాశీబుగ్గ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): అవినీతి సొమ్ముతో ఏర్పాటు చేసిన సాక్షి మీడియా అసత్య ప్రచారాలు మానుకోవాలని తెలుగుదేశం పార్టీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ పలాస సమన్వయకర్త వెంకన్న చౌదరిపై విషం చిమ్ముతూ ఇటీవల సాక్షి టీవీలో ప్రచారమైన కథనంపై టీడీపీ శ్రేణులు భగ్గుమన్నాయి. ఆదివారం జంట పట్టణాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. సాక్షికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పాత బస్టాండ్ వద్ద గల ఎన్టీఆర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. మూడు రోడ్ల జంక్షన్ వద్ద సాక్షి ప్రతులను దహనం చేశారు. టీడీపీ నాయకులు వజ్జ బాబురావు, లొడగల కామేశ్వరరావు, పీరుకట్ల విఠల్, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, దువ్వాడ శ్రీకాంత్, ఎం.శ్రీనివాసరావు, సప్ప నవీన్, రవి శంకర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

అబద్దాపు రాతలు నమ్మొద్దు

వజ్రపుకొత్తూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): అవనీతి నుంచి పుట్టిన అబద్దపు సాక్షి పత్రిక రాతలు ఎవరూ నమ్మొద్దని మండల టీడీపీ అధ్యక్షుడు సూరాడ మోహనరావు అన్నారు. ఎమ్మెల్యే గౌతు శిరీష కుటుంబంపై అసత్య ప్రచారం చేయడంపై ఆదివారం మండల కేంద్రంలో సాక్షి దినపత్రిక ప్రతులను తగలబెట్టారు. ఎమ్మెల్యే శిరీష చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక మాజీ మంత్రి అప్పలరాజు తప్పుడు రాతలు రాయిస్తున్నారన్నారు. గౌతు కుటుంబాన్ని విమర్శించే అర్హత మాజీ మంత్రి అప్పలరాజుకు లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎ.ఉమామహేశ్వరరావు, హేంబాబు చౌదరి, అంబటి రామకృష్ణ ఉన్నారు. పూండిలో జరిగిన విలేకరుల సమావేశంలో అగ్నికుక్షత్రియ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు కర్ని రమణ మాట్లాడుతూ వెంకన్న చౌదరిపై తప్పుడు రాతలు రాస్తున్న సాక్షి మీడియా యాజమాన్యం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

తప్పుడు కథనాలపై మండిపాటు

హరిపురం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కుటుంబంపై తప్పుడు కథనాలు ప్రచారంపై టీడీపీ శ్రేణులు మండిపడ్డాయి. ఈ మేరకు ఆదివారం మందస మండలం హరిపురం-బాలిగాం కూడలిలో సాక్షిపేపరు ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. మచ్చలేని గౌతు కుటుంబంపై విమర్శించే అర్హత లేని వారంతా ఇలా అర్థరహిత, అవగాహన రహిత విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బావన దుర్యోధన, రట్టి లింగరాజు, దాసరి తాతారావు, బమ్మిడి కర్రయ్య, సాలిన మాధవరావు, మురళీ చౌదరి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


వజ్రపుకొత్తూరు: బస్టాండ్ వద్ద ప్రతులను దగ్ధం చేస్తున్న దృశ్యం


హరిపురం: పేపరు ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు

శ్రీకూర్మక్షేత్రం ఎంతో అద్భుతం

ఐదో పేజీ తరువాయి


హోంమంత్రి అనితను ఆశీర్వదిస్తున్న అర్చకులు

ఆదేశించారు. హోంమంత్రితో కలిసి ఫొటోలు తీసుకునేందుకు చాలామంది భక్తులు ఆసక్తి చూపారు. భక్తులతో కాసేపు ముచ్చటించి.. ఓ చిన్నారిని ఆమెను ఎత్తుకుని ముద్దాడారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు రాణా శ్రీనివాసమాదిగ హోంమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ వీ.ఎస్.గిరి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆదిత్యుడి సన్నిధిలో..

అరసవల్లిలోని ఆదిత్యుడ్ని కూడా హోం మంత్రి వంగలపూడి అనిత ఆదివారం దర్శించు కుని పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఈవో కేఎస్‌వీడీవీ ప్రసాద్ ఆమెకు స్వాగతం పలికారు. ఆలయ అనివెట్టి మండపంలో వేదాశీర్వచనం అందజేశారు. స్వామి ప్రసాదాలు, చిత్రపటాన్ని ఈవో అందజేశారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి హోం మంత్రిని కలిసి ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. క్షేమ సమాచారం తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాదారపు వెంకటేష్, ఉంగటి వెంకటరమణ, జల్లు రాజీవ్, ఇప్పిలి శివ, అర్చకులు హరిబాబు, సందీపశర్మ, రంజిత్‌శర్మ పాల్గొన్నారు.

రూపు కోల్పోతున్న హడ్డుబంగి గెడ్డ


పిచ్చిమొక్కలతో నిండిపోయిన గెడ్డ

కొత్తూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని సగం భూములకు సాగు నీరందించే హడ్డుబంగి గెడ్డ పిచ్చిమొక్కలతో నిండిపోయింది. దీంతో సాగునీటికి రైతులు ఇబ్బందిపడుతున్నారు. రానున్న కాలంలో గెడ్డ రూపురేకలు కోల్పోయి, మూసుకుపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో కొత్తూరుకు ఎగువ భాగంలో ఉన్న సీతంపేట కొండలపై కురిసిన వర్షపు నీరు ప్రవహించి సాగు నీరుగా వస్తుంది. గెడ్డ సాగునీటితో వందలాది ఎకరాలకు సాగునీరు అంది వ్యవసాయ పంటలు రైతు పండిస్తారు. కొత్తూరు, మహాసింగి, కర్లెమ్మ, బడిగాం, మహార్తాపురం, కుంటిబద్ర, కాట్రగడ, కొరమ గ్రామాలకు చెందిన వందలాది ఎకరాలకు సాగునీరు ఈ గెడ్డ ద్వారా అందుతుంది. ఈ ప్రాంత రైతులకు ఎంతో అవసరమైన ఈ గెడ్డకు మరమ్మతులు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

ఘనంగా ఉజ్జుడి పూజలు

పలాసరూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ పంటలు బాగా పండాలని కోరుతూ కాశీబుగ్గ జగన్నాథసాగర ఆయకట్టు రైతుల ఆధ్వర్యంలో ఆదివారం ఉజ్జుడి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కాశీబుగ్గ లోని ప్రధానవీధుల్లో ఉజ్జుడిని ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేపట్టారు. మధ్యాహ్నం కోసంగిపురం వద్ద గల మరిడమ్మకు ప్రత్యేక నైవేద్యం అందించి పంటలు బాగా పండాలని కోరుతూ పూజలు జరిగాయి. కార్యక్రమంలో జగన్నాథసాగర ఆయకట్టు రైతులు, మహిళలు పాల్గొన్నారు.

7న సురేఖపాణిగ్రాహి సంతాపసభ

పలాసరూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): బొడ్డపాడు గ్రామం అమరవీరుల స్మారక మందిరం ఆవరణలో ఈ నెల 7న సురేఖపాణిగ్రాహి సంతాపసభ నిర్వహించనున్నట్టు వామపక్ష సంఘాల నాయకులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా అమరవీరుల స్మారక మందిర ఆవరణలో సంతాప సభ కరపత్రాలను విడుదల చేశారు. రైతాంగ పోరాటంలో సుబ్బారావు పాణిగ్రాహి పాల్గొన్నప్పుడు ఆయన సహచారిణిగా ఆమె చేదోడువాదోడుగా నిలిచారని, ఆమె చేసిన మరువలేనిదన్నారు. సంతాపసభను విజయవంతం చేయాలని కోరారు.

నేడు పజా సమస్యల పరిష్కార వేదిక

పాతపట్నం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణ వేదికగా సోమవారం ఉదయం 10 గంటలకు టెక్కలి ఆర్డీవో ఆధ్వర్యంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు తహసీల్దార్ నందిగామ ప్రసాదరావు తెలిపారు. టెక్కలి డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల ప్రజలు తమ సమస్యలను సంబంధిత అధికారులకు తెలియజేసి పరిష్కరించుకోవచ్చన్నారు. అన్నిశాఖల అధికారులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

లయన్స్ క్లబ్‌కు ఉత్తమ అవార్డు

పలాస రూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ లయన్స్ క్లబ్‌కు ఉత్తమ అవార్డు వరించింది. ఆదివారం విశాఖలో జరిగిన కార్యక్రమంలో 2024-25 సంవత్సరంలో ఉత్తమ సేవలందించడంపై అవార్డుకు ఎంపిక చేశారు. దీంతో క్లబ్ సభ్యులు తెప్పల కృష్ణమూర్తి, రోణంకి హేమాచలం అవార్డును విశాఖ లయన్స్ క్లబ్ సభ్యుల నుంచి అందుకున్నారు.

గుడ్‌టచ్-బ్యాడ్‌టచ్‌లను గుర్తించాలి

పాతపట్నం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): గుడ్‌టచ్ బ్యాడ్ టచ్‌లను గుర్తించగలగాలని శక్తియాప్ కోఆర్డినేటర్ ఎం.గిరిధర్ అన్నారు. స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. శక్తియాప్ సభ్యులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎరువులు సక్రమంగా అందించాలి

మెళియాపుట్టి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన ఎరువులు సక్రమంగా అందించాలని పలువురు ఎంపీటీసీలు సంబంధిత అధికారులను కోరారు. ఆదివారం ఎంపీపీ ఈశ్వరమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రైతుసేవా కేంద్రలు వద్ద రోజంతా కాపాల కాస్తే ఒక బస్తా దొరుకుతుందని అధికార్ల దృష్టికి తీసుకురాగా యూరియా వాడకం తగ్గించాలనే ఉద్దేశ్యంతోనే తక్కువ ఇస్తున్నట్టు తెలిపారు. వారం రోజుల్లో కొసమాల పీఏసీఎస్ ద్వారా ఎరువులు అందిస్తామని అధ్యక్షుడు సలాన మోహనరావు తెలిపారు. వివిధ సమస్యలపై చర్చించారు. తహసీల్దార్ బి.పాపారావు, ఎంపీడీవో ప్రసాద్‌పండా, వైస్‌ఎంపీపీలు అధినాయుడు, ధనలక్ష్మి, ఉదయ్ పాల్గొన్నారు.

'ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం'


కరపత్రాలు అందిస్తున్న జడ్పీటీసీ

హిరమండలం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొటిగా నెరవేరుస్తోందని జడ్పీటీసీ పొగిరి బుచ్చిబాబు అన్నారు. ఆదివారం మండలంలో పుట్టిగాం గిరిజన గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల సంక్షేమం కోసమే సూపర్ సిక్స్ పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు. అలాగే చేతి వృత్తుల వారిని ప్రోత్సహించాలని ఇటీవల జడ్పీటీసీ పి.బుచ్చిబాబు కోరడంతో నాబార్డు జిల్లా డెవలప్‌మెంట్ మేనేజర్ కె.రమేష్‌కృష్ణ మేదరవీధి, సుభలయ, పాత హిరమండలంలో పర్యటించారు. చేతివృత్తుల వారిని కలిసి వారి ఆర్థిక పరిస్థితిపై ఆరా తీశారు. ఖాదీ, గ్రామీణ పరిశ్రమ డైరెక్టర్ శివప్రసాద్ రెడ్డి తదితరులు ఉన్నారు.